## క్లుప్తంగా

### ఆర్‌అండ్‌బీ చీఫ్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు చేపట్టనున్న జాతీయ రహదారి విస్తరణ నేపథ్యంలో పటాన్‌చెరు మీదుగా ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరుతూ రోడ్లు భవనాలశాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే ఆయన పట్టణంలో పర్యటించి, నివేదిక రూపొందించనున్నట్టు రాష్ట్ర ఉన్నతాధికారులు తెలిపారన్నారు.

### పందులు, కుక్కల పట్టివేత



పర్యవేక్షిస్తున్న కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులు, కుక్కలను మంగళవారం పట్టించారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు. పందుల యజమానులకు వారం రోజుల గడువునిస్తూ నోటీసులిచ్చారు. అయినా ఫలితం లేకపోవడంతో స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు వాటి పట్టివేతకు చర్యలు తీసుకున్నారు.

### నీలం మధుకు బాధితుడి కృతజ్ఞతలు



మధును సన్మానిస్తున్న పవన్‌కుమార్

పటాన్‌చెరు టౌన్: మండలంలోని చిట్కుల్ గ్రామం రాధమ్మ కాలనీకి చెందిన ఆంధ్రప్రదేశ్‌లోని అహోబిలానికి చెందిన పవన్ కుమార్‌కు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం కాంగ్రెస్ నేత నీలం మధు రూ.లక్ష సహాయాన్ని అందజేశారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అనంతరం పవన్ కుమార్ మంగళవారం తన కుటుంబంతో కలిసి వచ్చి మధుకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ నీలం మధు తనలాంటి వాళ్లను ఎంతో మందిని ఆదుకున్న మంచి మనిషి అని కొనియాడారు.

### జిల్లా బ్రాహ్మణ సంఘం కార్యదర్శిగా వినోద్‌పాటిల్



నారాయణఖేడ్: సంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శిగా నారాయణఖేడ్ మండలం రుద్రార్ గ్రామానికి చెందిన వినోద్ పాటిల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం నాయకులు మంగళవారం తెలిపారు. అలాగే నారాయణఖేడ్‌కు చెందిన జీవన్‌రావు దేశ్‌ముఖ్ ఉపాధ్యక్షుడుగా, కల్హేర్‌కు చెందిన సంగమేశ్వర్ రావు కులకర్ణి సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వినోద్‌పాటిల్ మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమం కోసం కృషి చేస్తానని చెప్పారు.

### బీఆర్‌ఎస్‌లోకి చేరికలు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని రాపర్తి మాజీ సర్పంచ్ మంద శ్రావణ్ కుమార్ మంగళవారం బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరడం తెలిసిందే. భూపాల్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. దీంతో శ్రావణ్ కుమార్ తన అనుచరులతో కలిసి సొంత గూటిని చేరారు.

### 11 మంది బైండోవర్

మద్దూరు(హుస్నాబాద్): ఓ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసిన 11మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రేబర్తికి చెందిన ఒగ్గు నర్సయ్య తనను బహిష్కరించారని కులపెద్దలపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో బాధితుడిపై కుల సంఘం పెద్దలు వజ్జపు ఉప్పలయ్య, బెల్లపు యాదయ్య, ఒగ్గు మల్లేశం, ఓజయ్య, శవల్ల బాలమల్లు, వజ్జల పెద్ద రాజయ్య, ఈరి నరేశ్, రవి, బియ్య మహేశ్, ఈరి లింగయ్య ఆదివారం దాడి చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వారిని తహసీల్దార్ సంజీవ్ ఎదుట బైండోవర్ చేశారు.



పుల్‌కల్ తహసీల్దార్ కార్యాలయంలో..



నారాయణఖేడ్ విగ్రహం వద్ద నాయకుల నివాళులు



కల్హేర్(నారాయణఖేడ్): అధికారుల నివాళులు

# జయశంకర్ సేవలు మరువలేం

- ఘనంగా జయంతి వేడుకలు
- వివిధ నేతల నివాళులు

జిల్లావ్యాప్తంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, అధికారులు ఆయా ప్రాంతాల్లోఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పార్టీల నాయకులు, అధికారులు తెలంగాణ సాధనలో జయశంకర్ చేసిన కృషిని ప్రశంసించారు. ఆయన పాత్ర చాలా కీలకమైనదని కొనియాడారు.



రామచంద్రాపురం(పటాన్‌చెరు) : ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్



సంగారెడ్డి : జేఎన్‌టీయూలో..



సంగారెడ్డి: నివాళులర్పిస్తున్న నాయకులు



జహీరాబాద్ టౌన్: జయశంకర్ సర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని భవిత జూనియర్ కళాశాలలో..



కంది(సంగారెడ్డి): కందిలో..

### 'స్వచ్ఛదనం పచ్చదనం' ముమ్మరం



కంది(సంగారెడ్డి): నీటిలో క్లోరిన్ శాతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆరుట్ల, చిద్రుప్ప, బేగంపేట, తుంకిళ్ల తండాలో మంగళవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై ప్ర జలకు అవగాహన కల్పించారు. మొక్కలు నాటారు. ఆరుట్లలో తాగు నీటిలో క్లోరిన్ శాతాన్ని పరీక్షించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్ రెడ్డి మాట్లాడు తూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి



పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామాల్లో అందరూ తమ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఎంపీడీఓ సుధాకర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రం ఝరాసంగంతో పాటు వివిధ గ్రామాల్లో స్వచ్ఛదనం- పచ్చదనం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అధికారులు పర్యటించి, నీటి ట్యాంకులు శుభ్రపర్చటంతో పాటు పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏపీఓ రాజ్‌కుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

# వయనాడ్ ప్రజలకు అండగా నిలుద్దాం

పటాన్‌చెరు టౌన్: ప్రకృతి వైపరీత్యాలతో సర్వం కోల్పోయిన కేరళలోని వయనాడ్ ప్రజలకు మనమంతా అండగా నిలుద్దాం అని సీపీఎం పార్టీ నాయకులు పాండు, రంగారెడ్డి అన్నారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కేరళ వయనాడ్ వరద బాధితులకు మంగళవారం మండలంలోని ఇస్మాపూర్ లో విరాళాల సేకరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, గంగాధర్, ఆంజనేయులు, మూర్తి, విష్ణు ఇతరులు పాల్గొన్నారు.



విరాళాల సేకరిస్తున్న సీపీఎం నాయకులు

# పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం



మురికికాలువలో దోమల మందును చల్లుతున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. మురుగుకాలువలో చెత్తను తొలగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగ్యస్వాములు కావలని కోరారు. కార్యక్రమంలో ఉపకమిషనర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**రామచంద్రాపురం..**

రామచంద్రాపురం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేష్ పాల్గొన్ని మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్ కల్పన పాల్గొన్నారు.

### పోలీసుల ముమ్మర తనిఖీలు

జహీరాబాద్ టౌన్: ఎస్పీ ఆదేశాల మేరకు జహీరాబాద్ పోలీసులు మంగళవారం పట్టణంలో స్నీఫర్ డాగ్స్‌తో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. భవానీ మందిరం చౌరస్తా తదితర ప్రాంతాలను క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కాశీనాథ్ మాట్లాడుతూ తనిఖీల్లో ఆరు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. రిజిస్ట్రేషన్ లేని ఎనిమిది వాహనాలను సీజ్ చేశామన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసి ఆర్టీఓకు అప్పగిస్తామన్నారు.



స్నీఫర్ డాగ్స్‌తో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ కాశీనాథ్, పోలీసులు

### విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేసిన రోటరీ సభ్యులు

జహీరాబాద్: కోహీర్ మండలం పైడిగుమ్మల్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏడుగురు విద్యార్థినులకు రోటరీ క్లబ్ సభ్యులు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పాటిమీది మహిపాల్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ వై.జయసింహారెడ్డి మాజీ ఎంపీటీసీ జ్ఞానరత్నంలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఎర్రోని దావిద్, చంద్రారెడ్డి, ప్రభాకర్, గౌస్, నర్సింహులు, సంగమేష్, సువర్ణ పాల్గొన్నారు.

### ఘనంగా గద్దర్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తెల్లాపూర్‌లోని గద్దర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొల్లూర్ భరత్, చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి, తూర్పు శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

# డీడీల మొత్తాన్ని ఖాతాల్లో జమచేయాలి

నారాయణఖేడ్: గొర్రెలు పంపిణీ చేయకపోవడంతో రెండో విడత గొర్రెల పంపిణీ కోసం కట్టిన డీడీలకు సంబంధించిన డబ్బులను వెంటనే వారివారి ఖాతాల్లో జమచేయాలని కోరుతూ ఖేడ్ మండలం రుద్రారం గొర్రెకాపరుల సహకార సంఘం చైర్మన్ సిందోల్ దశరథ్, కురుమ యువత సంఘ బాధ్యులు విష్ణు, కృష్ణ, రమేశ్‌తో కలిసి మంగళవారం సంగారెడ్డిలో పశుసంవర్ధకశాఖ జేడీ వసంతకు వినతిపత్రం అందజేశారు. ఖేడ్ నియోజకవర్గానికి సంబంధించి 571యూనిట్ల డబ్బులు పెండింగులో ఉన్నాయని పేర్కొన్నారు. ఖాతాల్లో జమచేయడానికి జేడీ సానుకూలంగా స్పందించారని దశరథ్ తెలిపారు.



జేడీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

# యాజమాన్య పద్ధతులపై అవగాహన



పంట సాగు విధానంపై పరిశీలిస్తున్న ఏడీఏ

కల్హేర్(నారాయణఖేడ్): రైతులు తమ పంట సాగులో వ్యవసాయ అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించాలని నారాయణఖేడ్ డివిజన్ ఏడీఏ నూతన్ కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం కల్హేర్ మండల కేంద్రంలో వరి, పత్తి తదితర పంటలను పరిశీలించారు. ఎరువుల వాడకం, యజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పట్టా సాగు నమోదు వివరాలు పరిశీలించారు. ఏఈఓ సంతోష పాల్గొన్నారు.

### బిడ్డల మరణంతో తల్లి మనస్తాపం

- పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి

బంట్వారం: ఇద్దరు కుమార్తెలు మరణించడంతో మనస్తాపం చెందిన ఓ వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం సల్బత్తాపూర్‌లో చోటు చేసుకుంది. ఏఎస్సై నజీర్ అహ్మద్‌బేగ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన లొంక జ్యోతి(25)కి ఆరేళ్ల కిందట సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం మనియార్‌పల్లికి చెందిన బేగరి రాచయ్యతో ప్రేమ వివాహం జరిగింది. అయితే పెళ్లయినప్పటి నుంచి జ్యోతి పుట్టింట్లోనే ఉంటోంది. రాచయ్య అప్పుడప్పుడూ సల్బత్తాపూర్‌కు వచ్చి వెళ్లేవాడు. వీరికి నాలుగేళ్ల కిందట తొలి కాన్పులో పుట్టిన చిన్నారి కొద్ది రోజులకే మరణించింది. అనారోగ్యం బారిన పడిన రెండో కూతురు సైతం గత మే నెలలో చనిపోయింది. ఇద్దరు బిడ్డలను కోల్పోయిన జ్యోతి తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి స్పృహ కోల్పోయింది. కొద్ది సేపటికి తర్వాత ఇంటికి వచ్చిన తల్లి సావిత్రి.. స్థానికుల సాయంతో జ్యోతిని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసిన పోలీసులు, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## సంక్షిప్త వార్తలు

**◆ గిరిజన దినోత్సవానికి రండి**

సంగారెడ్డి రూరల్ : సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9న జరిగే అంతర్జాతీయ గిరిజన దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీజీఐబీసీ చైర్మన్ నిర్మలను సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్ నాయక్ మంగళవారం ఆహ్వానించారు. గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్, విద్యార్థి సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పూల్‌సింగ్ నాయక్, యువజన సంఘల సమితి జిల్లా అధ్యక్షులు బ్రహ్మనందరెడ్డి, జిల్లా నాయకులు దినేశ్ నాయక్, బాబూలాల్ నాయక్, శివాజీనాయక్‌లు ఉన్నారు.

**◆ రూ.15కోట్లతో రహదారి విస్తరణ పనులు**

పటాన్‌చెరు: అమీన్‌పూర్ నుంచి వాణినగర్ వరకు రహదారి విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణం పూర్తయితే.. అమీన్‌పూర్ నుంచి వాణి నగర్ మీదుగా ఆర్టీసీ కాలనీ, పీజీఆర్ కాలనీ, మాధవపూర్ హిల్స్ తదితర కాలనీలకు నేరుగా రహదారి సౌకర్యం ఏర్పాటు అవుతుందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కల్పన ఉపేందర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తలారి రాములు, సీనియర్ నాయకులు కొల్లూరు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**◆ స్థానికంగా రిజర్వేషన్లు అమలు చేయండి**

సంగారెడ్డి టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు ప్రభుగౌడ్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తేనే న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, వెంకటేశం, సుధాకర్ గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**◆ పారిశుద్ధ్య పనుల పరిశీలన**



జహీరాబాద్: మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో మురికి కాలువలను స్పెషలాఫీసర్ నారాయణరావు మంగళవారం పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని వార్డు ప్రజలకు సూచించారు. ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు చేపట్టాలని అధికారులతో చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సంధ్య పాల్గొన్నారు.

**◆ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి**



జహీరాబాద్ టౌన్: సొంత ఇల్లు లేని మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు స్థలాలు ఇవ్వాలని సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి మహిపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లులేని వారిని గుర్తించి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ. 6 లక్షల ఆర్థిక సాయం చేయాలని కోరారు. నాయకులు సలీమోద్దీన్, రాజు పాల్గొన్నారు.

**◆ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సిద్ధిరాజు గుప్తా**



హత్నూర(సంగారెడ్డి): దౌల్తాబాద్‌లోని మాణిక్య ప్రభు మందిరంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బైసాని వెంకటేశం గుప్తా ఆధ్వర్యంలో మంగళవారం సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా బూరుగు సిద్ధిరాజు గుప్తా, ఉపాధ్యక్షుడిగా బైసాని లక్ష్మణ్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా మా చెట్టి శ్రీనివాస్ గుప్తా, కోశాధికారిగా ఎలిమిటి మాణిక్యం గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీని శాలువాలతో సత్కరించారు.

**◆ డంప్ చేసిన ఇసుక సీజ్**

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళ్లపల్లి శివారులో ఏఎస్ఆర్ బ్రిక్స్ కంపెనీ సమీపంలో తిప్పారపు నవీన్‌చారి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా అక్రమంగా నిలువ చేసిన ఇసుకను మంగళవారం టాస్క్ ఫోర్స్, పోలీసులు సీజ్ చేశారు. ఈ ఇసుక దాదాపు 150టన్నుల ఉంటుందని అంచనా వేశారు.

### శ్రావణమాసం సందడి



సాముహిక పూజలు చేస్తున్న మహిళలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రావణమాసంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ ఆలయం, శ్రీ వాసవికన్యక పరమేశ్వరి ఆలయాలలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వైశ్య భవనంలో గల కన్యకాపరమేశ్వరి అమ్మవారికి 108 మంది మహిళల భక్తులతో పారాయణం చేశారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది.